సాక్షి నిర్మల్

శనివారం । 29 । మార్చి । 2025



'కడెం'పై సేఫ్టీ బృందం

కడెం ప్రాజెక్ట్‌ను 'స్టేట్ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్' బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వరద గేట్లు, కౌంటర్ వెయిట్‌లు, లిఫ్టింగ్ రోప్‌లను పరిశీలించారు. 10లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 625	ఆది : 4:56

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.0 /26.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వన్ నేషన్-వన్ ఎలక్షన్‌తో తగ్గనున్న ఆర్థికభారం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌ఖైస్‌గేట్: వన్ నేషన్-వన్ ఎలక్షన్‌తో ప్రభుత్వానికి ఆర్థికభారం తగ్గుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గాజులపేట్ మున్నూరు కాపు సంఘ భవనంలో శుక్రవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో 'ఒక దేశం-ఒక ఎన్నిక' కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నాయకులు రాంనాథ్, సత్యనారాయణగౌడ్ హాజరై మాట్లాడారు. 'ఒక దేశం-ఒక ఎన్నిక' విధానం పక్షపాతాన్ని నివారించి పాలనపై దృష్టిని పెంచుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల కార్తిక్, సుంకరి సాయి, మెడిసెమ్మే రాజు, కమల్ నయన్, ఒడిసెల అర్జున్, మహేశ్, గంగాధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ, ఫైలేరియాపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేందర్

నిర్మల్‌ఖైస్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం మాన్ కైండ్ సంస్థ సహకారంతో లెప్రా ఇండియా సొసైటీ ఆధ్వర్యంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు లెప్రసీ, ఫైలేరియాపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రాజేందర్ మాట్లాడుతూ.. జిల్లాలో కుష్ఠు, బోదకాలు వ్యాధిని అరికట్టడానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, లెప్రా ఇండియా సొసైటీ ఫిజియోథెరపిస్ట్ కిషన్, డిప్యూటీ పీఎంవో గంగన్న, రాజేశ్వర్‌రావు, పీహెచ్‌ఎన్ విమల, ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

నిర్మల్‌ఖైస్‌గేట్: మరో వారం రోజుల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ప్రారంభించనున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎస్.ప్రవీణ్‌రెడ్డి ఓ ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా కొనుగోలు కమిటీ సమావేశం చైర్మన్ అధ్యక్షతన గురువారం నిర్వహించినట్లు తెలిపారు. మొదట సారంగపూర్, కుభీర్, భైంసా, నిర్మల్, ఖానాపూర్‌లో కేంద్రాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి రూ.2,225 మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులకు విక్రయించి నష్టపోవద్దని తెలిపారు. మొక్కజొన్న పంటను ఎండలో ఆర బెట్టి తేమ 14శాతానికి మించకుండా చూడాలని పేర్కొన్నారు.

30న పంచాంగ పఠనం

నిర్మల్‌ఖైస్‌గేట్: జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30 సాయంత్రం 5గంటలకు పంచాంగ పఠనం నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది విశిష్టత, పచ్చడి, రాశిఫలాలు తదితర అంశాలను కొండాజీ వెంకటాచారి, నూకల పోశెట్టిగుప్త, బైరోజు శ్రవణాచారి వివరిస్తారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

జిల్లా కేంద్రంలో..

నిర్మల్ టౌన్: ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని ఉత్సవ్ బంకెట్ హాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘచాలక్ డాక్టర్ ప్రమోద్‌చంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం సాయంత్రం 6గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

గడువు మూడురోజులే..

- ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులు 8శాతమే
- రిబేట్ ఇచ్చినా స్పందన అంతంతే
- గడువు పొడిగిస్తారని ఎదురుచూపు
- ఎలాంటి ప్రకటన చేయని సర్కారు



భైంసాలో దరఖాస్తుదారుకు ప్రొసీడింగ్ ఇస్తున్న కమిషనర్ రాజేశ్‌కుమార్



సర్వర్ సమస్య తలెత్తగా ఖాళీగా సిబ్బంది కుర్చీలు



నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో క్యూ కట్టిన దరఖాస్తుదారులు

భైంసాటౌన్: ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపు గడువు మూడురోజుల్లో ముగియనుండగా దరఖాస్తుదారుల్లో స్పందన పెద్దగా కనిపించడంలేదు. ఈ నెల 31 వరకు చెల్లింపు గడువు విధించిన ప్రభుత్వం 25 శాతం రిబేట్ కూడా ప్రకటించింది. గడువులోపు ఫీజు చెల్లించి 25శాతం రాయితీని వినియోగించుకోవాలని మున్సిపల్ అధికారులు ఎంత ప్రచారం చేసినా చెల్లింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఆయా మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేశారు. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో కలిపి మొత్తం 26,996 దరఖాస్తులు రాగా, వీటిలో పలు కారణాలతో కొన్నింటిని తిరస్కరించి, 18,130 దరఖాస్తులను క్రమబద్ధీకరణకు అర్హత ఉన్నవిగా గుర్తించారు. అయితే, ఇప్పటివరకు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు కలుపుకొంటే 8శాతం మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. శుక్రవారం దరఖాస్తుదారుల తాకిడి పెరగడంతో కొద్దిసేపు సర్వర్ సమస్య తలెత్తింది. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడ్డారు. ఈనెల 31తో గడువు ముగియనున్న నేపథ్యంలో సెలవురోజులైన 30, 31 తేదీల్లోనూ మున్సిపల్ కార్యాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు.

గ్రామపంచాయతీల్లో...

జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీల పరిధిలోనూ ఎల్‌ఆర్‌ఎస్‌పై ఫీజు రాయితీకి అవకాశం కల్పించారు. 130 గ్రామపంచాయతీల పరిధిలో 2020లో 14,615 దరఖాస్తులు రాగా, ఆయా దరఖాస్తుదారులకు పంచాయతీ అధికారులు ఫోన్లు చేస్తూ ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో కలిపి శుక్రవారం ఒక్కరోజే రూ.24 లక్షల వరకు ఫీజు రూపంలో వసూలు చేశారు. ఇంకా మూడు రోజులే గడువు ఉండగా, చాలామంది వివిధ కారణాలతో ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం ఫీజు చెల్లింపు గడువు పొడిగిస్తుందని మరికొందరు భావిస్తున్నారు. కానీ.. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	చెల్లించినవారు	వసూలు (రూ.కోట్లలో)
నిర్మల్	10,408	1,193	3.57
భైంసా	6,354	422	0.50
ఖానాపూర్	1,368	84	0.15
పంచాయతీలు	14,615	1,076	1.63



సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌ఆర్‌ఎస్‌పై రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. ఏమైనా సందేహాలుంటే, సిబ్బందిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. ఈనెల 30, 31 తేదీల్లోనూ కార్యాలయంలో అందుబాటులో ఉంటాం.

– బీ రాజేశ్‌కుమార్, భైంసా మున్సిపల్ కమిషనర్

మహిళా సమాఖ్యకు కలెక్టర్ అభినందన



మహిళా సమాఖ్య సభ్యులు, అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌ఖైస్‌గేట్: శ్రీనిధి రుణ బకాయిల వసూళ్ల లక్ష్యాన్ని పూర్తిచేసి రాష్ట్రస్థాయిలోనే రెండో స్థానంలో నిలిచిన లోకేశ్వరం మండల ప్రగతి మహిళా సమాఖ్య బృందం సభ్యులు, అధికారులను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, మండల సమాఖ్య సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది ఉత్సవాలు

నిర్మల్‌ఖైస్‌గేట్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ముందస్తు ఉగాది ఉత్సవాలను నిర్వహించారు. మెప్మా సిబ్బంది ముగ్గులు వేసి కలెక్టర్ ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలు, అధికారులకు ముందస్తు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధికారులతో కలిసి ఉగాది పచ్చడి సేవించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు.



ఉగాది పచ్చడి సేవిస్తున్న కలెక్టర్, అధికారులు

ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎస్పీ జానకీ షర్మిల
- వైద్యులు, సిబ్బందికి సన్మానం



వైద్యులు, సిబ్బందితో ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ టౌన్: పోలీసులు ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. పోలీసులకు ఉచిత మెడికల్ టెస్టుల క్యాంప్‌ను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నెలపాటు నిర్వహించారు. ఇందులో విధులు నిర్వర్తించిన వైద్యాధికారులు, మెడికల్ సిబ్బందిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తుంటే పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యం పాడవుతుందని గ్రహించి వైద్యాధికారులతో మాట్లాడి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 30 ఏళ్ల పైబడిన 703 మంది పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రిపోర్టులు వచ్చిన తర్వాత సంబంధిత వైద్యులకు చూపించి మందులు ఇప్పించినట్లు తెలిపారు. క్యాంపులో విధులు నిర్వహించిన డాక్టర్లు, ఆస్పత్రి, ల్యాబ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేశ్ మీనా, ఏవో యూనస్‌అలీ, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, సమ్మయ్య, ఆర్‌ఐలు రాంనిరంజన్, శేఖర్, రామకృష్ణ, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా కొనుగోళ్లు చేపట్టాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌ఖైస్‌గేట్: రబీలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు ప్రక్రియల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఓపీఎంఎస్ యాప్, జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన లోకల్ యాప్, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియపై అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. గన్నీ సంచులు, టార్పాలిన్లు, తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రత్న కళ్యాణి, డీఎస్వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, డీసీవో పాపయ్య, ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులకు ప్రమాదం'

నిర్మల్‌ఖైస్‌గేట్: కార్మికులకు సంబంధించి 42 చట్టాలను 1 ఏప్రిల్ 2025 నుంచి తొలగించిన కేంద్రం నాలుగు కార్మిక వ్యతిరేక కోడ్‌లను అమలు చేయనుండగా కార్మికుల హక్కులకు ప్రమాదం వాటిల్లనుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్-04 జిల్లా మహాసభలు నిర్మల్ మండల లెవెల్ పాయింట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ.. సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ పోరాటంతోనే హమాలీ రేట్లు పెరిగాయని చెప్పారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న ఢిల్లీలో జరిగిన సమావేశంలో దేశవ్యాప్తంగా మే 20న జాతీయ సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వం పోలీసులు, అధికారులను ఉపయోగించి సమ్మె విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్మికులు దీనిని సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఎస్.విలాస్ మాట్లాడుతూ.. సివిల్ సప్లయ్ కార్మికులు చేపట్టిన నాలుగు రోజుల సమ్మె విజయవంతమైందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తీవ్ర పోరాటం తప్పదని హెచ్చరించారు. నాయకులు శ్రీనివాస్‌చారి, ఎస్‌ఎన్ రెడ్డి భూక్య రమేశ్, రాథోడ్ పుండలిక్, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



లక్ష్మణచాంద: రికార్డులు పరిశీలిస్తున్న రాజేందర్

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో రాజేందర్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఇన్, అవుట్ వార్డుల రోగుల వివరాలు డాక్టర్ ప్రత్యూషను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ హాజరు పరికరాన్ని పరిశీలించారు. ఓపీ గదికి మరమ్మతు చేయించుకోవాలని సూచించారు. ఎన్‌సీడీ పీవో శ్రీనివాస్ ఉన్నారు.

మామడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో రాజేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యులు శ్రీనివాస్, రవీందర్, అరుణ్, ప్రత్యూష ఉన్నారు.

సివిల్ సప్లయ్‌లో ముగ్గురిపై వేటు

- డీఎం, డీఎస్వో, డీటీల సస్పెన్షన్
- రైస్‌మిల్లు తనిఖీల్లో జాప్యంతోనే..
- సస్పెన్షన్ పైనా అనుమానాలు



నిర్మల్: జిల్లా పౌరసరఫరాలశాఖలో ముగ్గురు అధికారులపై వేటుపడ్డట్లు తెలిసింది. డీఎం, డీఎస్వో, డీటీలకు శాఖ కమిషనర్ దేవేంద్రచౌహాన్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. జిల్లాలో ఇటీవల సీఎంఆర్‌లో చోటుచేసుకుంటున్న మాయాజాలం, కొంతమంది మిల్లర్లు ధాన్యం అమ్ముకుని రూ.కోట్లు కొల్లగొట్టిన తీరు బయటపడుతున్న సందర్భంలో ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలియడం చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడూ లేనంతగా అధికారులు జిల్లాలో రైసుమిల్లులపై కేసులు పెడుతున్న క్రమంలో వారు సస్పెండ్ కావడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ కేసులోనేనా..!

జిల్లాలోని చాలా రైసుమిల్లుల్లో రూ.కోట్ల విలువ చేసే ధాన్యం మాయమైంది. ఈక్రమంలోనే నర్సాపూర్ మండలం అర్లి ఎక్స్‌రోడ్డు సమీపంలోగల ద్వారకామయి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లుపై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ కేసులో 2022-23 రబీ, 2023-24 ఖరీఫ్, 2023-24రబీ సీజన్‌లకు సంబంధించి ఏకంగా రూ.48కోట్లకు పైగా విలువ చేసే ధాన్యం మాయం కావడం గమనార్హం. 2022-23 రబీ, 2023-24 ఖరీఫ్, 2023-24రబీ సీజన్‌లకు సంబంధించి సదరు మిల్లుకు 16,427మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించారు. ఆ మిల్లు నుంచి 11,006.090 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) రావాల్సి ఉండగా, ఈఏడాది ఫిబ్రవరి వరకు 1031.218 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. మిగతా 9,974.972 మెట్రిక్ టన్నులు ఇవ్వలేదు. అధికారులు తనిఖీ చేసినప్పుడు సంబంధిత ధాన్యం మిల్లులో లేదు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసు కారణంగానే తాజాగా డీఎం గోపాల్, డీఎస్వో కిరణ్‌కుమార్, డీటీ రమాదేవికి సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది.

కేసులు పెడుతున్నా..

గతంతో పోలిస్తే.. ఇటీవల సివిల్ సప్లయ్ అధికారులు సీరియస్‌గానే స్పందిస్తున్నారు. ఐదునెలల పరిధిలోనే జిల్లాలో 21కేసులు పెట్టడం గమనార్హం. ఇందులో 12 క్రిమినల్ కేసులున్నాయి. ఏడు మిల్లులపై రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) యాక్ట్ పెట్టారు. మిగతా మిల్లులపైనా అమలు చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇంతలోనే సదరు జిల్లా అధికారులపై వేటువేయడం అనుమానాలకు తావిస్తోంది. ద్వారకామయి మిల్లు తనిఖీల విషయంలో ఆలస్యం చేశారన్న కారణం చూపుతూ ముగ్గురు అధికారులపై వేటు వేసినట్లు సమాచారం. మరోవైపు వీరిపై కొంత మంది మిల్లర్ల ఒత్తిడి, రాజకీయ కోణంలో సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారా..!? అన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌ఖైస్‌గేట్: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డైరీని శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబురావు, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు పుష్ప తదితరులున్నారు.

పదో తరగతి పరీక్షలకు 10 మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 9,129 మంది విద్యార్థులకు గాను 9,119 మంది హాజరయ్యారు. జిల్లా పరీక్షల అధికారి ముడారపు పరమేశ్వర్ జిల్లా కేంద్రంలోని జుమ్మారాత్‌పేట్ ఉన్నత పాఠశాల, సోమవార్‌పేట్ బాలికల పాఠశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రైతులపై దాడి సరికాదు



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌ఖైస్‌గేట్: రైతులపై పంజాబ్ ప్రభుత్వం, పోలీసుల దాడి చేయడం హేయమైన చర్య అని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పేర్కొన్నారు. పంజాబ్‌లో నిరసన తెలుపుతున్న రైతులపై పోలీసుల దాడికి వ్యతిరేకంగా శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు నూతన్‌కుమార్, జే రాజు మాట్లాడారు. మోదీ పాలనలో దేశంలో రోజుకు 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి, రైతుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని తెలిపారు. పదేళ్లలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం రూ.16లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసిందని విమర్శించారు. ఒక్క రూపాయి కూడా రైతు రుణాన్ని మాఫీ చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు డాకూర్ తిరుపతి, నాగెల్లి నర్సయ్య, శంభు, గోనె స్వామి, గుట్ల ప్రసాద్, మంక శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సూచనలు చేయాలి

నిర్మల్‌ఖైస్‌గేట్: అన్ని వర్గాలకు చెందిన ఓటర్లను భాగస్వాములను చేసేందుకు వినూత్న కార్యక్రమాల అమలు, పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన గత ఎన్నికల్లో పోలీస్ శాఖ సహకారం, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణ తీరుకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించినట్లు చెప్పారు. ఓటింగ్ శాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో మరింత పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృదేవో భవ..



ఖానాపూర్ మండలం మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం మాతృ, పితృ వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల పాదాలు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు తమ అనుభవాలను అందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నరేందర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో పిల్లల్లో పూజ్యభావం పెంపొందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. – ఖానాపూర్

క్లుప్తంగా

బాసర ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

బాసర: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీని శుక్రవారం ఆలయ అధికారులు లెక్కించారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి ఆలయ అక్షరాభ్యాస మండపంలో 43 రోజుల హుండీ లెక్కింపును చేపట్టారు. భక్తులు సమర్పించిన కానుకలు, హుండీల ద్వారా నగదు రూపంలో రూ. 53,36,176, బంగారం 73 గ్రాములు, వెండి 2 కిలోల 100 గ్రాములు, విదేశీ కరెన్సీ 21 నోట్లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది, శ్రీజ్ఞాన సరస్వతి సేవాసమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల రిఫరీగా వినోద్



వినోద్

జన్నారం: జాతీయ స్థాయి యోగా రిఫరీ డిప్లొమా పోటీలలో పరీక్ష రాసి, ఉత్తీర్ణత సాధించి యోగా రిఫరీగా జన్నారం మండలం మహ్మదబాద్‌కు చెందిన దుర్గం వినోద్ ఎంపికయ్యాడు. ఈనెల 23న నిర్వహించిన ఆన్‌లైన్ యోగా పరీక్ష రాసి ప్రతిభ కనబరిచినట్లు తెలంగాణ యోగా అసోసియేషన్ కార్యదర్శి సిద్దారెడ్డి, మాజీ కార్యదర్శి మనోహర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అశోక్ అగర్వాల్ చేతుల ఉత్తీర్ణత పత్రం అందుకున్నాడు.

సెలవు దినాల్లోనూ సేవా కేంద్రాలు

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 30, 31న వినియోగదారుల సేవా కేంద్రాలను తెరిచి ఉంచనున్నట్లు బీఎస్ఎన్ఎల్ నిజామాబాద్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజులు అయినప్పటికీ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లా వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జామ్ గ్రామానికి చెందిన నేరడిగొండ శ్రీనివాస్ ఉపాధిహామీ పనులకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా.. సారంగాపూర్ వైపు నుంచి నిర్మల్ వైపు బైక్‌పై వెళ్తున్న తాండ్ర సాయన్న అనే జామ్ గ్రామం వద్దకు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. దీంతో స్థానికులు 108 సమాచారం ఇచ్చి నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

దొంగ అరెస్ట్

నిర్మల్ టౌన్: ఓ మహిళను బెదిరించి, డబ్బులు లాక్కునేందుకు యత్నించిన వ్యక్తిని హాస్పిటల్ సెక్యూరిటీ పట్టుకున్న ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కుంటాల మండలానికి చెందిన మహిళ స్థానిక ప్రసూతి ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చి వెళ్లే క్రమంలో.. బైంసా పట్టణానికి చెందిన షేక్ మోసీన్ అనే వ్యక్తి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. అక్కడే ఉన్న సెక్యూరిటీ అతడిని పట్టుకొని, పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి దగ్గర ఉన్న బైక్ కూడా దొంగిలించినదిగా పోలీసులు గుర్తించారు.

గ్రామాల్లో సౌర వెలుగులు..!

- 'పీఎం సూర్యఘర్ మస్త్ బిజిలీ యోజన'కింద ఎంపిక
- ఉమ్మడి జిల్లాలో రెండు మోడల్ గ్రామాలు
- పూర్తయిన సర్వే



వెంకట్రావ్‌పేటలో సర్వే చేస్తున్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం లక్ష్యంగా సోలార్ విద్యుత్ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి 'సూర్యఘర్ మస్త్ బిజిలీ యోజన' పథకం కింద సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతీ జిల్లాలో ఒక గ్రామాన్ని మోడల్ తీర్చిదిద్దనున్నారు. దీంతో ఆ గ్రామాల్లో సోలార్ వెలుగులు విరజిమ్మనున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నర్సపూర్, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్ మండలం వెంకట్రావ్‌పేట్‌ను మోడల్ గ్రామాలుగా ఎంపిక చేశారు. కాగా ఆ గ్రామాల్లో ఎన్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేశారు. ఎన్ని ఇండ్లు, విద్యుత్ సర్వీస్ మీటర్లు, వ్యవసాయ కనెక్షన్లు, తదితర వివరాలపై సర్వే చేపట్టారు. ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదించి, తదుపరి ఆదేశాలు రాగానే పనులు ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ చెబుతున్నారు.

సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా..

కేంద్ర ప్రభుత్వం, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ద్వారా, రాష్ట్రంలో రెడ్‌కో విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ప్రతీ జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దనున్నారు. సౌరశక్తి గ్రామంగా తీర్చిదిద్దేందుకు కేంద్రప్రభుత్వం రూ. కోటి సాయం అందిస్తుంది. స్థానిక ఉత్పత్తి చేయడం విద్యుత్ ఖర్చులు తగ్గనున్నాయి.

ఇంటి యజమానికి ఆదాయం..

రూఫ్ లెవల్ బిల్డింగ్‌పై కిలోవాట్ సోలార్ ఏర్పాటుకు 80 నుంచి 90 స్క్వేర్ ఫీట్లు, 2 కిలోవాట్స్ సోలార్ ప్లాట్ ఏర్పాటుకు 160 నుంచి 190 స్క్వేర్ ఫీట్లు, 3 కిలోవాట్స్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 270 స్క్వేర్ ఫీట్ల స్థలం అవసరం ఉంటుంది. వ్యవసాయ బోరుబావుల వద్ద 7.5 కిలోవాట్స్ ప్లాంట్ ఏర్పాటుకు బోరుబావుల నుంచి 100 మీటర్ల డీయషన్ పరిధిలో సరైన ప్రదేశం అవసరం ఉంటుంది. 2 కిలోవాట్స్ ప్లాంటు ఏర్పాటు అయితే ఇంటి యజమానికి నెలకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల ఆదాయం వరకు, బోరు బావుల వద్ద 7.5 కిలోవాట్స్ ప్లాంటుకు రూ. 5 వేల నుంచి రూ 6 వేల వరకు ఆదాయం యజమానికి చేరుతుంది. దీంతో పాటు రైతు గృహ అవసరాలకు విద్యుత్‌ను వినియోగించుకునే అవకాశం ఉంది.

ఎంపిక చేసిన గ్రామాల వివరాలు..

గ్రామం	విద్యుత్ కనెక్షన్లు	రిజిస్ట్రేషన్	వ్యవసాయ కనెక్షన్లు	రిజిస్ట్రేషన్
వెంకట్రావుపేట	1415	1405	346	340
నర్సపూర్	131	128	76	75

ఉమ్మడి జిల్లాలో రెండు గ్రామాలు..

సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం, సమాజం తమ ఇంధన అవసరాలకు తీర్చుకోవడంలో స్వావలంబన పొందేలా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మోడల్ సోలార్ విలేజ్ అనే పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం అమలుకు రాష్ట్రంలోని 17 జిల్లాలలో 8 గ్రామాలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ డివిజన్ పరిధిలో నర్సపూర్, మంచిర్యాల జిల్లా పరిధిలో లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట్ గ్రామాలను ఎంపిక చేశారు. నర్సపూర్‌లో 131 విద్యుత్ మీటర్లుకు 128ఇండ్లను అర్హతగా గుర్తించారు. వ్యవసాయ బోర్లు 75 నమోదు పూర్తి చేశారు. వెంకట్రావ్‌పేటలో 1415 విద్యుత్ మీటర్లకు 1405, 346 వ్యవసాయ బోరుబావుల కనెక్షన్లకు 340 నమోదు చేశారు. మొత్తం 1746 కనెక్షన్‌లు నమోదు చేశారు. ఇంటి యజమాని పేరు, బ్యాంకు ఖాతా నెంబర్, ఆధార్ నెంబర్, రూఫ్ లెవల్‌లో ఉన్న స్థలం వివరాలను సేకరించారు. ఎంత సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఏర్పాటు చేయాలో వివరాలు సేకరించారు. ఆ వివరాలను సూర్యఘర్ పోర్టల్‌లో నమోదు చేశారు.

సర్వే పూర్తి చేశాం..



ప్రధాన మంత్రి సూర్యఘర్ మస్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. మోడల్ గ్రామాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటుకు చేసేందుకు సర్వే చేశాం. ఏడీఈ, ఏఈ, సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటి వివరాలు, యాజమాని పేరు, ఆధార్‌కార్డు వివరాలు సేకరించారు. రైతులకు సోలార్ ప్లాంట్ ప్రయోజనాలను వివరించాం.

– గంగాధర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, మంచిర్యాల

'కడెం'ను సందర్శించిన డ్యాం సేఫ్టీ బృందం



ప్రాజెక్టును పరిశీలిస్తున్న డ్యాం సేఫ్టీ బృందం

కడెం: కడెం ప్రాజెక్టును శుక్రవారం 'స్టేట్ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్' బృందం సభ్యులు రిటైర్డ్ సీఈ, ఐడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్ కె.సత్యనారాయణ, స్టేట్ డ్యాం సేఫ్టీ చీఫ్ ఇంజనీర్ ప్రమీల సందర్శించారు. ప్రాజెక్ట్ వరద గేట్లు, కౌంటర్ వెయిట్‌లు, లిఫ్టింగ్ రోప్‌లను పరిశీలించారు. వరద గేట్ల ఆపరేటింగ్ సమస్యలు, ప్రాజెక్ట్ స్థితిగతులను ఎస్ఈ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు చేశారు. ఇందులో ఈఈ విఠల్ రాథోడ్, డీఈ నవీన్, విజయలక్ష్మి, గణేశ్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీల్డ్ ఏజెన్సీ బృందం సందర్శన

నీటిపారుదల శాఖ కడెం ప్రాజెక్ట్ పూడికతీత టెండర్ల ప్రక్రియను ఈనెల 27న, పూర్తి చేసి, పనులను ఏజెన్సీకి అప్పగించారు. శుక్రవారం ఏజెన్సీ సిబ్బంది కడెం ప్రాజెక్టును సందర్శించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ఏజెన్సీ పేరు, వివరాలు కరీంనగర్ సీఈ పరిధిలో ఉంటాయని, టెండర్ గురించి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఎస్ఈ రవీందర్ తెలిపారు.

సరిహద్దు ప్రాంతంలో విస్తృత తనిఖీలు



జాగిలంతో తనిఖీలు చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నార్కోటిక్ జాగిలంతో ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా తెలంగాణలోకి వచ్చిపోయే వాహనదారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గంజాయి రహిత ప్రాంతంగా మార్చేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయడంతో పాటు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయి సేవించిన, రవాణ చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్, ఎక్సైజ్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నీలుగాయిని హతమార్చిన వేటగాళ్ల అరెస్టు

- నిందితుల్లో ఒకరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు



అధికారుల అదుపులో వేటగాళ్లు

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి అటవీ ప్రాంతంలో నీలుగాయిని హతమార్చిన వేటగాళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పెంచికల్‌పేట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లోడుపల్లి అటవీ ప్రాంతంలోని సహజ నీటి వనరుల వద్ద నీలుగాయిని హతమార్చానే పక్కా సమాచారంతో రావడంతో సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించాం. కొండపల్లి గ్రామానికి చెందిన చప్పిడే వెంకటేశ్, ఎల్లూర్ గ్రామానికి చెందిన దుర్గం రవీందర్‌ల ఇళ్లల్లో తనిఖీలు చేయగా.. నీలుగాయి మాంసం లభ్యమైంది. వారిని విచారించగా కొండపల్లి గ్రామానికి చెందిన ఆత్రం రవి, గొర్లపల్లి మొండి, మన్నెపల్లి శ్రీహరి, ఆత్రం భీమయ్యలతో కలిసి నీలుగాయిని హతమార్చినట్లు ఒప్పుకున్నారు. వెంకటేశ్, దుర్గం రవీందర్‌ను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. దుర్గం రవీందర్ పెంచికల్‌పేట్ మండలంలోని మెరెగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పరారీలో ఉన్న మిగతా నలుగురిని పట్టుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో శంకర్, ఎఫ్‌బీవోలు సంగదీప్, సతీష్, లచ్చన్న, మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రవేశాలు జరిగేనా..?

- ఇంటర్ విద్యలో అమలుపై స్పష్టత కరువు
- మన్యువల్‌గానే ప్రవేశాలు
- విద్యార్థులపై ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడి



బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

బోథ్: డిగ్రీలో అమలు చేస్తున్న దోస్త్ విధానం తరహాలోనే ఇంటర్ ప్రవేశాలపై పీటముడి నెలకొంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం వచ్చినా.. మన్యువల్ గానే ప్రవేశాలు పొందుతున్నారు. ప్రైవేటు యాజమాన్యాలు తమ కళాశాలల్లో చేరాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల్లో అయోమయం నెలకొంది. దీంతో ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల ప్రవేశాలపై స్పష్టత కరువైంది.

ప్రైవేట్ కళాశాలల ఆగడాలను చెక్..

ఇంటర్ ప్రవేశాల్లో దోస్త్ తరహా ఆన్‌లైన్ విధానం అమలైతే విద్యార్థులకు మేలు జరుగుతుంది. విద్యార్థి తనకు నచ్చిన కళాశాలలను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకునే వీలుంటుంది. పదో తరగతిలో విద్యార్థికి వచ్చిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా కేటాయింపులు జరుగుతాయి. ఈ విధానంతో విద్యార్థి తనకు నచ్చిన కళాశాలలో చదివే వీలు ఉంటుంది. వివిధ ఫేజ్‌లతో కూడిన ప్రవేశాలు ఉంటే విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉండదు. ఇంటర్‌లో కూడా డిగ్రీ మాదిరిగానే ఆన్‌లైన్ ప్రవేశాలు చేపడితే ప్రైవేట్ కళాశాలల ఆగడాలను చెక్ పడనుంది.

విద్యార్థుల వద్దకు పీఆర్‌వోలు..

పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ఈక్రమంలో ప్రైవేట్ యాజమాన్యం క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఇప్పటికే ఎండను సైతం లెక్క చేయకుండా ప్రతీ గ్రామాన్ని సందర్శిస్తున్నారు. తల్లిదండ్రులను కలిసి తమ కళాశాలల్లో చేరాలని కోరుతున్నారు. విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. కాగా ఆయా కార్పొరేట్ కళాశాలలకు చెందిన పీఆర్‌వోలు విద్యార్థులతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

మొదట చేరి.. తరువాత తిరిగి వచ్చి..

పదో తరగతి పరీక్షలను విద్యార్థులు రాయకముందే పలు ప్రైవేట్ కళాశాలలకు చెందిన పీఆర్‌వోలు విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులను కలిసి తమ కళాశాల గురించి వివరించి అడ్మిషన్లు చేస్తున్నారు. అడ్మిషన్ల సమయంలోనే వేలల్లోనే ఫీజులు కట్టించుకుంటున్నారు. ఇక పదో తరగతి పాస్ కాగానే విద్యార్థి కనీసం నెల రోజులు కూడా కళాశాలలో ఉండకుండా ఇంటికి వచ్చేస్తున్నారు. తాము కట్టిన ఫీజు వాపసు ఇవ్వకుండా కళాశాలల యాజమన్యాలు తల్లిదండ్రులను తిప్పించుకుంటున్నాయి. దీంతో తల్లిదండ్రులు నష్టపోతున్నారు. డిగ్రీ మాదిరిగా ఇంటర్‌లో ఆన్‌లైన్ ప్రవేశాలు చేపడితే ఇలాంటి నష్టాలు జరిగే అవకాశం ఉండదు. చెల్లించే ఫీజు వివరాలు కూడా ఆన్‌లైన్ అడ్మిషన్‌లో కనిపిస్తాయి. దీంతో ఎక్కువ ఫీజును కట్టే అవకాశం కూడా ఉండదు.

కళాశాలల వివరాలు (ప్రభుత్వ, ప్రైవేట్)

ఆదిలాబాద్	76
నిర్మల్	63
మంచిర్యాల	62
కుమురం భీం ఆసిఫాబాద్	48

ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలి



ఇంటర్ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలి. డిగ్రీ మాదిరిగా ప్రవేశాలు నిర్వహిస్తే విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. కార్పొరేట్ కళాశాలలకు చెందిన పీఆర్‌ఓలు గ్రామాల్లోకి వచ్చి అడ్మిషన్లు తీసుకుంటున్నారు. దీంతో విద్యార్థుల నుండి అధిక ఫీజులు అడ్మిషన్ల సమయంలో వసూలు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఆన్‌లైన్‌లో ప్రవేశాలు జరిపితే విద్యార్థి మంచి కళాశాలలో చదివే అవకాశం ఉంటుంది.

– బోయిడి ఆకాష్, ఏబీవీపీ నాయకుడు

ఎలాంటి నోటిఫికేషన్ రాలేదు

గతంలో ఇంటర్‌లో ఆన్‌లైన్‌లో ప్రవేశాల కోసం విద్యార్థి కళాశాలకు దరఖాస్తు చేసుకునే వీలుంది. విద్యార్థి కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలంటే కళాశాల లాగిన్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. లేదా విద్యార్థి తాను స్వయంగా ఆన్‌లైన్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని కళాశాలలో చేరే అవకాశం ఉంది. కాని డిగ్రీ తరహా దోస్త్ మాదిరి ఆన్‌లైన్ ప్రవేశాలు ఇంటర్‌లో లేవు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటిఫికేషన్, సమాచారం లేదు.

– గణేశ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, ఆదిలాబాద్

వ్యక్తి హత్యకు సుపారీ

ఇచ్చోడ: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన భూతగాదాల్లో రాజేందర్ అనే వ్యక్తిని చంపేందుకు సుపారీ తీసుకున్న షేక్ సోహెల్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన గొల్లెన రాజేందర్, మేకల దేవేందర్ మధ్యలో గత కొద్ది రోజులుగా భూమి వివాదం నడుస్తోంది. అయితే మేకల దేవేందర్ ఈనెల 16న ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన షేక్ సోహెల్‌ను కలిసి గొల్లెన రాజేందర్‌ను హత్య చేసేందుకు రూ. 3 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. అయితే ఈనెల 26న షేక్ సోహెల్ రాజేందర్‌ను ఇచ్చోడ మండల కేంద్రంలో కలిసి నిన్ను హత్య చేసేందుకు దేవేందర్ సుపారీ ఇచ్చాడని, నువ్వు డబ్బులు ఇస్తే హత్య చేయకుండా వదిలేస్తానని బెదిరించాడు. భయాందోళన చెందిన రాజేందర్ సోహెల్‌కు ఫోన్‌పే ద్వారా రూ. 2 వేలు చెల్లించాడు. మరింత డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు షేక్ సోహెల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుళ్లిన మాంసం.. కాలం చెల్లిన స్వీట్లు

- బల్దియా అధికారుల తనిఖీల్లో గుర్తింపు



స్వీట్లను పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ బల్దియా పారిశుద్ధ్య విభాగం అధికారులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు హోటల్స్, స్వీట్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. కలెక్టర్‌చౌక్‌లోని ఓ హోటల్‌ను తనిఖీ చేసిన అధికారులు కుళ్లిన 6 కిలోల మాంసం, గడ్డ కట్టిన పాడైన చేపలను గుర్తించారు. వాటిని నిల్వ ఉంచిన ఫ్రీజ్‌లో పురుగులు ఉండటంతో హోటల్ యాజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళ్లిన మాంసతో పాటు ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. హోటల్ నిర్వాహకుడిని హెచ్చరించి, జరిమానా విధించారు. అనంతరం వినాయక్ చౌక్‌లోని వెంకటేశ్వర స్వీట్‌షాపు, స్వీట్ల తయారీ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించారు. కాలం చెల్లిన స్వీట్లను తయారు చేసిన స్వీట్లతో కలిపి విక్రయిస్తున్నట్లు గుర్తించి, జరిమానా విధించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే చర్యలు తప్పవని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.నరేందర్, బైరి శంకర్‌లు హెచ్చరించారు.

రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తాం

- డీఎస్పీ జీవన్‌రెడ్డి
- వ్యక్తిపై దాడి చేసి కిడ్నాప్
- 9 మందిపై కేసు.. ఆరుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి అన్నారు. రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనవరి 8న ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారుగూడకు చెందిన సయ్యద్ జాహిర్‌పై పలువురు దాడి చేసి, కిడ్నాప్ చేయడం జరిగిందన్నారు. ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో భయపడి ఎవరికీ చెప్పలేదు. ఈనెల 26న ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విచారణ చేపట్టగా షేక్ ఇజాజ్, షేక్ సలీంతో పాటు మరో ఏడుగురు ఇంటిలో బంధించి కొటి, సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఈ వీడియోల ఆధారంగా వారిపై కేసులు నమోదు చేశామన్నారు. దాడి చేసిన బంగారుగూడకు చెందిన షేక్ ఇజాజ్, షేక్ రోషన్, షేక్ ముజీబ్, ఖానాపూర్‌కు చెందిన హసీబుల్లా, సయ్యద్ జుబేర్, మహాలక్ష్మివాడకు చెందిన అమర్, షేక్ సోహెల్‌లను అరెస్టు చేయగా.. రాహేల్, షేక్ సలీంలు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి మూడు ఆటోలు, మూడు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న వారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో సీఐ ఫణిధర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది ఉన్నారు.

8వ షెడ్యూల్‌లో పొందుపర్చడం హర్షణీయం



మాట్లాడుతున్న భారత్ చౌహాన్

నార్నూర్: బంజారా (లంబాడా) గోర్‌బోలి భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పొందుపర్చుతూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భారత్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి మాట్లాడారు. బంజారా గిరిజనుల ప్రత్యేకమైన వేషాధారణ, భాష ఉన్నప్పటికీ లిపి లేక పోవడంతో గుర్తింపు లేదన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అడే డిగాంబర్, ఉట్నూర్ నాయక్ గంగారాం నాయక్, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.